

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఉదయం లేచేసరికి** నా ఫోన్‌లో చాలా ఈమెయిల్ నోటిఫికేషన్స్ ఉన్నాయి. ఒక్కసారిగా ఇన్ని ఈ మెయిల్స్ ఎక్కడినుండి, ఎవరి నుండి వచ్చాయా అనుకుంటుండగానే కళ్ళు మూతలు పడ్డాయి.

ప్రొఫెసర్ నేను చేసిన పేపర్ వర్క్‌లో ఏదో తప్పుందని, సరిచేసుకోమని ఈ మెయిల్ పంపారు. గబగబా ఆయన ఆఫీసుకి పరుగెత్తాను. అపాయింట్‌మెంట్ లేకుండా వెళ్ళినందుకు తిడతారేమో అని కాస్త భయపడ్డాను కానీ ఆయన నన్ను చూసిన వెంటనే "ఈజ్ ఇట్ ఫిక్స్‌డ్?" అడిగారు.

'నో' ఏం ఫిక్స్ చెయ్యాలి? అని అడిగాను.

మధ్యాహ్నం 12 లోపల పేపర్ వర్క్ ఫిక్స్ చెయ్యకపోతే నేను ఆయన కింద పని చెయ్యడానికి లేదు అని చెప్పారు. టైం దాదాపు 12 అయ్యింది. నా కంగారు చూసి వెంటనే ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఆఫీసుకి వెళ్ళమని చెప్పారు. గబుక్కున

పరుగులు తీసాను. నా కంగారు చూసి అక్కడ లైన్‌లో నిలబడినవారు పక్కకి తప్పుకున్నారు. నేను ప్రొఫెసర్ చెప్పింది వివరించగానే స్టూడెంట్ ఐడి అడిగారు. నా దగ్గర లేదు అని చెప్పాను. పూర్తిపేరు, వివరాలు అడిగి, కంప్యూటర్‌లో ఏదో చూసారు.

"సారీ. యూ హేవ్ బీన్ టర్మినేటెడ్" అన్నారు.

టైం 12.05 అయ్యింది. కళ్ళల్లోంచి వెంటనే నీరు పొంగిపొర్లింది. ఇంతలో అన్నయ్య ఫోన్ చేసాడు. అన్నయ్యకి ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలీక ఫోన్ ఎత్తలేదు. ఫోన్ మళ్ళీ మోగింది. కళ్ళు తుడుచుకుంటూ ఫోన్ ఎత్తాను. హలో అన్నాక కూడా ఫోన్ మోగడం ఆశ్చర్యన్ని కలిగించింది. ఆ శబ్దం వల్ల చిరాకు కలిగి, అసహనంగా లేచాను. 'అదంతా కలా?' ఎంతో ఆనందం కలిగింది.

ఆ శబ్దం హనీష ఫోన్ నుండి వస్తుంది. మౌనంగా దేవుడికి థాంక్స్ చెప్పి ఫోన్‌లో ఈ మెయిల్స్ చెక్ చేసాను. ప్రొఫెసర్ చదవమని కొన్ని పుస్తకాల పేర్లు పంపారు. కాలేజీ ఓరియెంటేషన్, ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఓరియెంటేషన్లకి ఆహ్వానం వచ్చింది. నెమ్మదిగా లేచాను. హనీష ఫోన్ మాట్లాడుతుంది.

తినడానికి ఉప్మా వండాను. నా పనులన్నీపూర్తై ప్లేటులో ఉప్మా పెట్టుకున్నాక కూడా హనీష ఫోన్ మాట్లాడుతూనే ఉంది. నన్ను గమనించి ఫోన్ పెట్టింది. కోపంగా ఉందా, ఏడుస్తుందా, మామూలుగానే ఉందా? అర్థంకాలేదు. మొహంలో ఏ ఎక్స్‌ప్రెషను లేదు. నా కలలో జరిగినంత ఘోరమైతే జరగదు అన్న ధైర్యంతో "గుడ్ మార్నింగ్, అంతా ఓకేనా?" అడిగాను.

"యా. ఇవాళ లేట్‌గా లేచావు" అంది.

"సారీ, మెలుకువ రాలేదు" అన్నాను.

"సారీ నాకెందుకు" వెటకారమో, కోపమో అర్థం కాలేదు.

"ఉప్మా చేసాను."

"ఓ. ఐ లవ్ ఉప్మా" కిచెన్‌లోకి వెళ్ళింది. దాంతో అంతా మామూలుగానే ఉందని అర్థమైంది.

"రేపు ఓరియెంటేషనట" చెప్పాను.

"బోరింగ్. చాలా బోరింగ్" అంది.

"అవునా? ఏం చేస్తారు?"

"ముందు ఏదో స్పీచ్ ఇస్తారు. చాలా బోరింగ్. నేనైతే దాదాపు నిద్రపోయాను తరవాత కేంపస్ చూపిస్తారు. స్టూడెంట్ ఐడీ ఇస్తారు."

"ఓ ఔనా. స్పీచ్ ఎంత సేపుంటుంది?"

"గంట మినిమం"

"ఓ. ఓకే మార్నింగ్ 9కి అన్నారు. మధ్యాహ్నంకల్లా అయిపోతుందా?"

"నువ్వు వచ్చేయచ్చు. నీకు కేంపస్ మొత్తం నేను చూపించేసాను కదా. స్టూడెంట్ ఐడీ దగ్గర నుండి ఇంటికి వచ్చెయ్. మిగిలిందంతా బోర్"

కాస్త ఇబ్బందిగా "ఓకే" అన్నాను.

చిన్నగా నవ్వి "నీకే రేపు తెలుస్తుందిలే, డోంట్‌వర్రీ" అంది.

నిమ్మకాయ పిండుకుని ఉప్మా తిని "చాలా బావుంది" అంది.

"వెటకారమా?" నవ్వాను.

"ఛీ. కాదు నిజంగానే."

"థాంక్స్,"

తిన్నాక ప్లేట్ కడుగుతూ పొద్దున వచ్చిన కలంతా చెప్పాను. ముందు పెద్దగా నవ్వింది. తరవాత పగటి కలలు నిజమవుతాయని భయపెట్టింది. నా భయం తెలిసి, "కానీ ఎవరికైనా చెపితే నిజం కావట" అంది.

దాని గురించి ఇంక ఆలోచించకూడదని "అయితే ఫరవాలేదులే  నీకు చెప్పానుగా" అన్నాను.

లైబ్రరీకి వెళ్ళి ప్రొఫెసర్ చెప్పిన పుస్తకాలు తీసుకుని చదువుదామని బయలుదేరాను.

"కొత్తగా ఒకమ్మాయి వచ్చిందట. ఏడుపు ఆపట్లేదట" హనీష చెప్పింది.

"అయ్యో" అన్నాను.

"పద, వెళ్ళి చూద్దాం" అంది.

"నేను రాను, నువ్వు వెళ్ళు" అన్నాను.

"ఆ అమ్మాయి ఇంట్లో వాళ్ళు రమ్మన్నారు. వాళ్ళకి ఏం చెయ్యాలో తెలియట్లేదట"

"వాళ్ళు మీ ఫేమిలీ ఫ్రెండ్సా?"

"కాదు" ఆశ్చర్యంగా చూసింది.

"కజిన్స్?"

"కాదు. ఎందుకు?"

"వాళ్ళ ఇంట్లో వాళ్ళు అన్నావుగా. డౌట్ వచ్చింది."

"ఇంట్లో వాళ్ళు అంటే ఇక్కడ ఎవరింట్లో ఉందో, వాళ్ళు" పెద్దగా నవ్వింది.

"సరే పద. తరవాత లైబ్రరీకి వెళ్తాను."

ఇద్దరం బయలుదేరాం. ఆ ఇంట్లో ఉంటున్న వాళ్ళకి నన్ను పరిచయం చేసింది. అక్కడ విపరీతంగా ఏడుస్తున్న అమ్మాయి కూడా ఉంది. ఆ అమ్మాయి అంతలా ఏడుస్తుంటే వాళ్ళు ఎలా జోక్స్ వేసుకుని నవ్వుకుంటున్నారా అని ఆశ్చర్యపోయాను. ఆ అమ్మాయిని ఓదార్చే ప్రయత్నం ఎంతమంది ఎన్ని రకాలుగా చేసినా ఎవరో చచ్చిపోయారన్నంత కృంగి కృశించి ఏడుస్తుంది. కాసేపటికి  నాకు ఆ అమ్మాయంటే చిరాకు కలిగింది. అందరూ 'అయ్యో పాపం' అంటుంటే విసుగు పెరిగింది.

"ఇంత మంది నీకు సహాయం చెయ్యడానికి ఉన్నా అంత ఎందుకు ఏడుస్తున్నావు?" అడిగాను.

"ఇంట్లో వాళ్ళు గుర్తొస్తున్నారు" చెప్పింది.

"అమెరికాకి వచ్చేముందు తెలుసుకదా వాళ్ళు రారని?"

ఏడుపు ఆపేసి నా మొహం చూసింది.

"తెలిసే వచ్చావు. కానీ ఇక్కడ ఇంతమంది మంచివాళ్ళు ఉన్నారు. ఇంకా ఏడుపెందుకు?"

అందరూ మాటలు ఆపి నన్నే చూడసాగారు. ఒక్క క్షణం అనవసరంగా అలా మాట్లాడాను అనుకున్నాను కానీ ఇప్పుడు చేసేదేమీ లేదని అన్నయ్య నేను ఇక్కడికి వచ్చేముందు తన రూమేట్స్ గురించి చెప్పిన కథలు కొన్ని చెప్పి "అలాంటి రూమ్మేట్స్ కాదు కదా వీళ్ళు, ఇంకెందుకు ఏడుపు?" నిలదీసాను. ఇల్లంతా నిశ్శబ్దం.

"కానీ అమ్మ అమ్మే" ఆ అమ్మాయి చెప్పింది.

వెంటనే హనీష పెద్దగా నవ్వింది. నేనూ నవ్వాను. నెమ్మదిగా గదంతా పెద్ద నవ్వులు. మాతో పాటు ఆ అమ్మాయి కూడా నవ్వేసింది. కొద్దిసేపు కబుర్లు చెప్పుకున్నాక నేను లైబ్రరీకి బయలుదేరాను. వారంతా కేంటిన్‌కి వెళ్ళి ఐస్‌క్రీం తిందామన్నారు. ఆ అమ్మాయి కూడా వచ్చింది. ఐస్‌క్రీం కొన్న వెంటనే వారికి బై చెప్పి వంటరిగా నడవడం ప్రారంభించాను. దారిలో ఎంతో మంది వంటరిగా నడుస్తూ కనిపించారు. ఒక్కదాన్ని వెళ్ళడం ఏదోలా ఉంది. దీనికి అలవాటు పడాలి. ఏది ఏమైనా ఇవాళ వచ్చిన కలతో పోలిస్తే ఇది నథింగ్ అనిపించింది. లైబ్రరీలో పుస్తకాలు వెతకడం కాస్త ఇబ్బంది కలిగింది. అక్కడ కంప్యూటర్‌లో ఎలా లాగిన్ అవ్వాలో ఎలా అయినా తెలియదని ప్రయత్నించలేదు. ఒక్కదాన్ని నడుస్తూ పుస్తకాలు వెతికాను. పైన ఫ్లోర్‌లో ఎయిర్ క్రాఫ్ట్‌కి సంబంధించిన పుస్తకం ఒకటి కనబడింది. ఆ పుస్తకం షెల్ఫ్‌లో వెదికాను. ప్రొఫెసర్ చెప్పిన పుస్తకాల్లో ఒక్కటి మాత్రం దొరికింది. అదికాకుండా ఆసక్తి కలిగే పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో మూడు తీసుకుని టేబుల్ మీద కూర్చున్నాను. ప్రొఫెసర్ చెప్పిన పుస్తకాన్ని ముందు తెరిచాను. అది కాసేపు చదివిన వెంటనే ఆకలి మొదలైంది. చదివి చాలా నెలలు అవడం వల్ల నా మెదడుకి అలవాటు తప్పిందని నాకు తెలుసు కనుక చదవడం ఆపలేదు. ఈ బుక్ చాలా బేసిక్ అవ్వడంతో పేజీలు వేగంగానే తిరిగాయి. రెండో చాప్టర్

పూర్తయ్యేసరికి అభిలాష్ వచ్చి పలకరించాడు. నా టేబుల్ మీద ఉన్న పుస్తకాలు చదివి "అబ్బో, క్లాసులు స్టార్ట్ అవ్వడానికి ముందే చదివేస్తున్నావే" వెటకారంగా అడిగాడు.

"ప్రొఫెసర్ చదవమన్నారు" బదులిచ్చాను.

"ఐడీ ఉందా?" అడిగాడు.

"లేదు."

"నేను చెకౌట్ చేస్తా, పద"

కాసేపు చదువుదామనుకుంటున్నా కూడా, ఇతను చెకౌట్ చేస్తా అన్నాడని లేచి నడిచాను. ఎందుకో డౌట్ వచ్చి, కిందకి వెళుతుండగా "ఈ బుక్స్ కూడా చేస్తావా?" అడిగాను.

"అందుకే రమ్మన్నాను" నవ్వాడు.

చెకౌట్ పూర్తయ్యాక "ఇంటికేనా? అడిగాడు.

తలూపాను.

ఇద్దరం కలిసి నడుస్తుండగా "అయినా నీ బుక్స్ చెకౌట్ చెయ్యనని ఎందుకనుకున్నావు?" అడిగాడు.

"ఏమో?" ఏం చెప్పాలో తోచలేదు.

"కేంపస్ అలవాటైందా?"

"కొంచెం అయింది."

"మెల్లిగా అదే అలవాటౌతుందిలే. రేపు ఓరియెంటేషన్‌కి వెళ్తున్నావా?"

"యా. వెళ్తున్నా"

"గుడ్. అది మేండేటరీ"

"హనీష చెప్పింది."

"క్లాసులు రిజిస్టరయ్యావా?

"లేదు."

"రేపు ఓరియంటేషన్ తరవాత చెప్తారులే ఎలానో"

"ఓకే"

"ప్రొఫెసర్ చెప్పారా ఏం క్లాసులు తీసుకోవాలో?"

"లేదు."

"రేపు అడుగు."

"సరే" ఇంతలో అతని ఇంటి దగ్గరకి వచ్చేసాము.

"బై" లోపలికి అర్ధాంతరంగా వెళ్ళిపోయాడు.

నేను పుస్తకాలు తీసుకుని ఇంటికి వెళ్ళాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story